క్లుప్తంగా

తహసీల్దార్‌గా సుందరరాజు బాధ్యతల స్వీకరణ



కొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా ఎం.సుందరరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండల తహసీల్దారుగా పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రాజ్‌కుమార్ పెదపూడి మండలానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు పలువురు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలి

డీఎస్పీ లతాకుమారి



దివిలిలో కవాతు చేస్తున్న పోలీసులు

పెద్దాపురం: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గ్రామీణులు సహకరించాలని డీఎస్పీ లతాకుమారి అన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ అమలు కానున్న నేపథ్యంలో గురువారం మండలంలోని దివిలి, కట్టమూరు గ్రామాల్లో ఎస్‌ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన అవసరమన్నారు. కోడ్ అమలులోకి రాగానే పోలీస్ విధులకు ప్రజలు సహకరించాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కొండెవరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాతలు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. దాత, ఎన్ఆర్ఐ జట్ల సూరిబాబు పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, ఇతర పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సామగ్రిని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో జట్ల దాసు, బర్రే వీరభద్రరావు, బర్రే సత్యనారాయణ, జట్ల వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో వేంచేసిన గొల్లమారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించగా స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్ని అన్న ప్రసాదం స్వీకరించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు కిట్లు అందజేసిన చైర్‌పర్సన్ అరుణ, వైద్యులు

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక నీలమ్మ చెరువు వద్ద లయన్స్ క్లబ్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైద్యులు కె.విజయపావని, రమ్యప్రభ, భవ్యశ్రీ, కౌన్సిలరు స్వయంభారపు వీరభద్రరావు, మున్సిపల్ ఎఎస్ఓ పెంకే శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం



పుణ్యస్నానాలకు సిద్ధమైన పాదగయ పుష్కరిణి



కుక్కుటేశ్వరసామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

- పాదగయ పుష్కరిణిలో వేలాదిగా పుణ్యస్నానాలు ఆచరించనున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పిఠాపురం: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో గురువారం కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి లక్షకుంకుమార్చన, లక్షచామంతి పూజ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. గురువారం అర్ధరాత్రి నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

పాదగయ పుష్కరిణిలో మహాశివరాత్రి పుణ్యస్నానాలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం సుమారు 4 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే పుష్కరిణి చుట్టూ ఖాళీ ప్రదేశాన్ని విస్తరించారు. జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల కంటే ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య అధికం. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలకు దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి సైతం లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు.

నేటి కార్యక్రమాలు ఇలా...

తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామివారి నిజరూప దర్శనం, ఉదయం 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 8 గంటల నుంచి స్వామివారి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పాదగయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లోనూ నిఘా ఏర్పాటు చేశారు. 32 సీసీ కెమెరాలతో నిత్యం ఎక్కడ ఏమి జరిగినా తెలుసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాల్లో పరిస్థితిని సమీక్షించనున్నట్లు తెలిపారు. ముగ్గురు సీఐలతో పాటు 15 మంది ఎస్సైలు 150 మంది పోలీసు సిబ్బందితో పట్టణంలో అన్ని ప్రాంతాల్లో భద్రత ఏర్పాటు చేసినట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని చెప్పారు. ముఖ్యంగా భక్తుల వస్తువులు దొంగతనాలకు గురి కాకుండా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశామన్నారు. భక్తులు విలువైన వస్తువులు తీసుకురాకుండా జాగ్రత్తలు వహించాలని ఆయన కోరారు.

ముగ్గుల పోటీలు

కొత్తపల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి ఆలయం వద్ద గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, లలితా పారాయణ, దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు.



కొత్తపల్లి రాజశేఖరస్వామి ఆలయం వద్ద ముగ్గులు వేస్తున్న చిన్నారులు

దేదీప్యమానం



విద్యుత్ దీపాలంకరణలో పాదగయ క్షేత్రం

పిఠాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. అధికారులు ఆలయం చుట్టూ కళ్లు మిరుమిట్లుగొలిపేలా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. రంగులతో ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే ఆదిదేవుని దివ్య కల్యాణం కనుల పండువగా జరగ్గా శుక్రవారం మహాశివరాత్రి పుణ్య స్నానాలకు సర్వం సిద్ధమైంది.

లింగోద్భవ కాలానికి వేళాయె



విద్యుత్తు దీపాలంకరణలో సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం

- కుమారారామ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేకపూజలకు సిద్ధం
- భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారుల ఏర్పాట్లు



కుమార రామభీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరిఅమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామ భీమేశ్వరస్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం. రాష్ట్రంలో అతి ప్రాచీన పంచారామ క్షేత్రాల్లో ప్రముఖమైనది. కాకినాడకు 14 కిలో మీటర్లు, రాజమహేంద్రవరానికి 52 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడు యోగలింగంగా సాక్షాత్కరిస్తారు. కుమరస్వామి దీనిని ప్రతిష్ఠించాడని ప్రతీతి. పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంగా పిలుస్తారు. ఇచ్చట దేవేరిని బాలాత్రిపుర సుందరిగా పిలుస్తారు. శుక్రవారం మహాశివ రాత్రి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో క్యూలైన్లు, విద్యుత్తు దీపాలంకరణ చేశారు. 9వ తేదీన రథోత్సవం జరుగుతుంది. 11వ తేది రాత్రి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

స్నానాల రేవుల పరిశీలన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్ర ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ స్నానాల రేవును మహాశివరాత్రి ఉత్సవాల ప్రత్యేకాధికారి అల్లు వెంకట దుర్గాభవానీ, ఈఓ బళ్ల నీలకంఠం గురువారం పరిశీలించారు. స్నానాలు చేసే భక్తులకు ప్రమాదం జరగకుండా శుభ్రం చేయించి మెష్ ఏర్పాటు చేశారు. అలాగే స్నానాల రేవు ఎదురుగా జల్లు స్నానం ప్రదేశాన్ని పరిశీలించి మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే పుష్కరిణి వద్ద స్నానాలకు ఏర్పాట్లు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ ఎ. ఈశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు చల్లా సత్తిబాబు, బీవీ రమణ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి..



భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. గోదావరి కాలువ, ఆలయ కోనేరుతో పాటు ఆలయ ముఖ ద్వారం వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశాం. క్యూలైన్లతో పాటు గోదావరి కాలువపై మూడో వంతెన మీదుగా భక్తుల రాకపోకలకు సదుపాయాలు కల్పించాం. దాతల సహకారంతో అల్పాహారం, పాలు, మజ్జిగ, భోజనాల ఏర్పాట్లు.

– బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

మాట ఇస్తే మడమ తిప్పని నేత జగన్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి
- కాండ్రకోటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోటలో గురువారం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీడీఓ ఉషారాణి, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌లతో కలిసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. ఏటి పట్టు పది గ్రామాలకు పట్టణ శివారులో రామేశం మెట్ట వద్ద పట్టాలు ఇవ్వడంపై కొంతమంది ఎందుకు పనికి రానివిగా ప్రచారం చేశారని, అవే స్థలాలు ఈ రోజు లక్షలు పెట్టిన పేదవాడు కొనుక్కోలేని విధంగా మార్కెట్ ధర మరింతగా పెరిగిందన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, అదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చేలా లబ్ధిదారులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, నాగబోయిన రాజబాబు, లక్కాకుల కృష్ణ, గవరసాని రాజశేఖర్, పెచ్చెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న డీఐజీ, ఎస్పీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని స్వామి, అమ్మవార్లను డీఐజీ అశోక్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారిని దర్శించుకున్న డీఐజీ, ఎస్పీలు

150 మందితో బందోబస్తు



బందోబస్తు సిబ్బంది రోల్ కాల్ నిర్వహించిన సీఐ సురేష్

సామర్లకోట: శివరాత్రి ఉత్సవాలకు 150 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేసిన్నట్లు సీఐ డి.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఆలయం వద్ద రోల్‌కాల్ నిర్వహించారు. ట్రెయినీ ఎస్పీ, ట్రెయినీ డీఎస్పీ, డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు 125 మందితో కలిపి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వారితో పాటు సెక్యూరిటీ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది భక్తుల సేవలందిస్తారన్నారు. భక్తులకు ఉప్పువారి సత్రం నుంచి పాలు, మజ్జిగ, లయన్స్ క్లబ్ నుంచి అల్పాహారం, మజ్జిగ, పారిశ్రామిక వేత్త కర్రి వెంకట్రాజు 25 వేల వాటర్ ప్యాకెట్లు, 25 వేల మందికి భోజనాలు, వాసవీ ఫ్రెండ్స్ నుంచి భోజనాలు, కొండపల్లి బ్రదర్స్ పేరున పాలు, మజ్జిగ పంపిణీ చేయడానికి ఇప్పటికే అధికారులు నుంచి అనుమతి పొందారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఎంపీడీఓను సత్కరిస్తున్న డీఎస్పీ, ఎంపీటీసీలు

- డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ లతాకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ జి.ఉషారాణి అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు పాటుపడాలన్నారు. ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ మహిళల హక్కుల పోరాటంలో సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని మహిళా ఎంపీటీసీ సభ్యులు, మహిళా ఉద్యోగులను డీఎస్పీ, ఎంపీపీ, ఎంపీడీఓ సత్కరించారు. మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, సీనియర్ సహాయకులు జగన్నాథం. మండల కో–ఆప్షన్ సభ్యులు శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.



మూలపేటలో వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

సామర్లకోట: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు వివిధ పోటీలు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళలు మరింత ప్రగతి సాధించాలన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకులు ఇస్తున్న రూ.20 లక్షల రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా గుర్తింపు పొందాలన్నారు. స్థానిక టీటీడీసీలో వస్త్ర పథకం ద్వారా ఇస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరప మండలానికి చెందిన మండల సమాఖ్య సభ్యురాలు భవాని హిందీ నేర్చుకొవడం ద్వారా తాను చేస్తున్న వ్యాపారంలో ఏడాదికి రూ.20 లక్షలు సంపాదిస్తున్నారన్నారు. సామర్లకోట వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రశాంతి అధ్యక్షత వహించగా జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన, ఉపాధ్యక్షురాలు జి కాంతం, కార్యదర్శి, జి.సంధ్యారాణి, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం, కోశాధికారి డి నిర్మల, డీఆర్‌డీఏ ఏపీఎం ఎస్.వేదకుమారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య తరపున డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణిని సత్కరించారు. ఉత్తమ వ్యాపార వేత్తలను పీడీ సత్కరించారు.



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న పీడీ శ్రీ రమణి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కొత్తపల్లి: మూలపేటలోని అరబిందో ఫార్మా ఫౌండేషన్ వృత్తి విద్యా శిక్షణా కేంద్రం, ప్రతిభా కంప్యూటర్ అండ్ కెరీర్ గైడెన్స్ కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మమత, మహిళా పోలీస్ సృజన ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. అతివలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

- టిడ్కో ఇళ్లను సత్వరమే అందజేయండి
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న విజ్జపు రాజశేఖర్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధి పనులపై అధికారుల నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కౌన్సిల్ మండిపడింది. కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులను ముమ్మరం చెయాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ రానున్నందున సత్వరమే టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్లను అందజేయాలన్నారు. కౌన్సిలర్ ఒబిలిశెట్టి నూకరత్నం తమ వార్డులో డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలన్నారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ కలుగ జేసుకుని ఆ వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. కౌన్సిలర్లు రాజశేఖర్, బాపూజీ, ఆరెళ్ళి వీర్రాఘవులు మాట్లాడుతూ పట్టణంలో పందులు, కుక్కలను నియంత్రించాలన్నారు. పలు అంశాలపై చర్చ అనంతరం పట్టణంలోని అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు 20 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, పెంటకోట సత్తిబాబు, తాటికొండ వెంకటలక్ష్మి, పేరిశెట్టి అంబిక, కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 40 మంది చేరిక



పార్టీలో చేరిన గౌరీ కోనేరు వాసులతో దవులూరి

పెద్దాపురం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలకున్న ప్రజాదరణే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో 19వ వార్డు గౌరీ కోనేరు ప్రాంతంలో ఆయా పార్టీలకు చెందిన సుమారు 40 మంది మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో కో–ఆర్డినేటర్ దొరబాబు సమక్షంలో పార్టీలో చేరారు. కౌన్సిలర్ కట్టా రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరీకోనేరుకు చెందిన పేకేటి సతీష్, అరిగెల కృష్ణ, పులవర్తి బాలాజీ, చెల్లూరి వీరబాబు, అడపా మహేష్, తూతిక సంతోష్, తూరంగి సుబ్బారావు తదితరులతో పాటు మరో 27 మంది పార్టీలో చేరగా వారికి దొరబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, సీనియర్ నాయకులు తాడి రాజశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలి

- ఆర్డీఓ జేవీఎస్ రామారావు



ఎన్నికల కోడ్‌పై సమీక్షిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ (ఎంసీసీ)ను సక్రమంగా అమలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేవీఎస్ రామారావు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో భాగంగా సిబ్బంది ఎన్నికల కోడ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండడానికి వీలు లేదన్నారు. మీమీ పట్టణ; గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఉన్న వాటిని వెంటనే తొలగించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యంగా ఉండరాదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీఓ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల సర్వే పూర్తి చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్యామ్ సుందర్

సామర్లకోట: ఈనెల 14 వరకు నిర్వహించే మానసిక దివ్యాంగుల సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఎంఆర్‌సీ సిబ్బందితో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎంఈఓ 2 పి.పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మానసిక దివ్యాంగులను గుర్తించే కార్యక్రమం జరుగుతోందని, ఈనెల 14 లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో 314 మంది మానసిక దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. మానసిక దివ్యాంగులల్లో 0–18 లోపు పిల్లలు ఉంటే వారిని మానసిక దివ్యాంగుల కేంద్రాలకు తరలిస్తామని ఎంఈఓ–2 తెలిపారు. సర్వే పూర్తి చేసి 15వ తేదీ నాటికి జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.